క్లుప్తంగా

ఎల్లమ్మ తల్లికి ఉదయభాను ప్రత్యేక పూజలు



జగ్గయ్యపేటఅర్బన్: జగ్గయ్యపేట పట్టణం కోదాడ రోడ్డు పుట్టబజారులో ఆదివారం వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు జేపీ శ్రీను స్వగృహం వద్ద ఎల్లమ్మ తల్లి కొలుపుల కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ మాజీ విప్ సామినేని ఉదయభాను, పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొని పూజలు నిర్వహించారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టులు ఖాళీ

కంచికచర్ల: కంచికచర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జనరల్, ఒకేషనల్ శాఖలో ఖాళీగా ఉన్న అతిథి అధ్యాపకుల (గెస్ట్ ఫ్యాకల్టీ) పోస్టులకు దరఖాస్తులు చేసుకోవచ్చని కళాశాల ప్రిన్సిపాల్ హఫీజ్ షేక్ అహ్మద్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మ్యాథ్స్-1, ఫిజిక్స్-1, ఎంపీహెచ్‌డబ్ల్యూ(యువతి)(నర్సింగ్)-1, ఎంఎల్‌టీ(ల్యాబ్ టెక్నీషియన్)-1 ఒకేషనల్ కోర్సులు బోధించుటకు అధ్యాపకులు కావాలని, సంబంధిత సబ్జెక్టులలో ఎంఎల్‌టీ కోర్సుకు పోస్టు గ్రాడ్యుయేషన్ బయోకెమిస్ట్రీ అండ్ మైక్రో బయోలజీ, ఎంపీహెచ్‌డబ్ల్యూకు బీఎస్సీ నర్సింగ్ గ్రాడ్యుయేషన్‌లో 50 శాతంతో కృతార్థులైన వారు అర్హులన్నారు. ఈనెల 23వ తేదీ లోపు కళాశాలలో ఆసక్తిగల అభ్యర్థులు దరఖాస్తులు అందజేయాలని తెలిపారు. దరఖాస్తుతో పాటు పదవ తరగతి, ఇంటర్మీడియెట్, డిగ్రీ, పోస్టు గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లు 2 సెట్లు జిరాక్స్ కాపీలు, 2 పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, ఆధార్ కార్డు జిరాక్స్ జత చేయాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు ప్రిన్సిపాల్ సెల్ నెంబర్ 98858 41277ను సంప్రదించాలని కోరారు.


మైలవరంలో...

మైలవరం: మైలవరం వీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జువాలజీ, షార్ట్‌హ్యాండ్, టైప్ రైటింగ్ పోస్టులకు గెస్టు ఫాకల్టీగా పనిచేసేందుకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ సొంగా సరళకుమారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జువాలజీ గెస్టు ఫాకల్టీకి ఎమ్మెస్సీ జువాలజీలో కనీసం 50శాతం మార్కులతో ఉత్తీర్ణత, గెస్టు ఫాకల్టీ టైప్ రైటింగ్, షార్ట్‌హ్యాండ్‌కు ఏదైనా డిగ్రీ, పీజీతో పాటు టైప్‌రైటింగ్ హయ్యర్ గ్రేడ్, షార్ట్ హ్యాండ్ లోయర్ గ్రేడ్ ఉండాలన్నారు. ఆసక్తిగల వారు తమ అర్హతలను తెలియజేస్తూ రెండు సెట్ల దరఖాస్తులను బుధవారం మధ్యాహ్నం మూడు గంటలలోగా మైలవరం వీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల కార్యాలయంలో అందజేయాలన్నారు. గురువారం ఉదయం 11 గంటలకు ప్రభుత్వ జూనియర్ కళాశాల, పాయకాపురం, రాధానగర్, విజయవాడ-5లో జరిగే ఇంటర్వ్యూకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాల్సి ఉంటుందని చెప్పారు. ఇతర వివరాలకు సెల్: 99665 53949 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

విజయవాడలో...

పాయకాపురం(విజయవాడరూరల్): పాయకాపురంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో ఇంగ్లిష్(ఆంగ్లం), వృక్షశాస్త్రం (బోటనీ) సబ్జెక్టులను బోధించేందుకు గెస్ట్ లెక్చరర్స్‌గా పని చేయుటకు అర్హతగల అభ్యర్థుల నుంచి దరఖాస్తులను కోరుచున్నట్లు జిల్లా విద్యాధికారి సీఎస్ఎస్ఎన్ రెడ్డి ఒక ప్రకటనలో కోరారు. పోస్ట్ గ్రాడ్యుయేషన్‌లో సంబంధిత సబ్జెక్టులో కనీసం 50 శాతం తక్కువ కాకుండా ఉత్తీర్ణులైన అభ్యర్థులు సదరు నకలు కాపీలతో నేరుగా ఈ నెల 22వ తేదీన ఉదయం 11 గంటలకు డీఐఈఓ ఆఫీసు, ప్రభుత్వ జూనియర్ కళాశాల, పాయకాపురం నందు హాజరుకావాలని తెలిపారు. గెస్ట్ ఫాకల్టీగా ఎంపికైన వారికి గంటకు రూ.150 చొప్పున, గరిష్టంగా నెలకు రూ.10 వేలకు మించకుండా చెల్లించనున్నట్లు పేర్కొన్నారు. రిటైర్డు ప్రొఫెసర్స్, లెక్చరర్స్, జూనియర్ లెక్చరర్స్‌కు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలిపారు.

వయ్యారి భామ నిర్మూలనపై అవగాహన



గరికపాడు(జగ్గయ్యపేట): గ్రామంలోని కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే)లో వయ్యారి భామ వారోత్సవాల సందర్భంగా మంగళవారం వ్యవసాయ కళాశాల విద్యార్థులకు వయ్యారిభామ నిర్మూలనపై అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా కేవీకే కోఆర్డినేటర్ కృష్ణంరాజు మాట్లాడుతూ వయ్యారి భామ వల్ల ప్రజలు చర్మ, ఊపిరితిత్తుల వ్యాధి బారిన పడతారన్నారు. ఈ మొక్కలను పీకి కాల్చేయాలని సూచించారు. రైతులు ఈ మొక్కపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. అనంతరం విద్యార్థులతో వ్యవసాయ క్షేత్రంలోని వయ్యారి భామ మొక్కలను నిర్మూలించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్త ప్రభావతి, వెంకటరెడ్డి, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

కనీస వసతులు లేని కబేళా

తాంబూలాలిచ్చాం...తన్నుకుచావండి అన్నట్టు కబేళా అడిగారు కదా నిర్మించి ఇచ్చాం అన్నట్టు అధికారులు పేటలో కబేళా ఒకటి కట్టి పడేశారు. కాని అది నిర్మించి 15 ఏళ్లవుతున్నా...దానికి కావలసిన కనీస మౌలిక సౌకర్యాలు కల్పించలేదు. దీంతో వ్యాపారులు దానిని వినియోగించడం మానివేశారు. చివరకు అది అనాథలకు, అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారింది.

- అధికారుల నిర్లక్ష్యంతో నిరుపయోగం
- లక్షలాది రూపాయల ప్రభుత్వ ధనం వృథా
- అసాంఘిక కార్యక్రమాలకు అడ్డా
- అనాథలకు ఆవాసంగా మారిన వైనం



అనాథలకు ఆవాసంగా మారిన కబేళా

జగ్గయ్యపేటఅర్బన్: పట్టణంలో మాంసం మార్కెట్ అభివృద్ధి కోసం మున్సిపాలిటీ వారు నిర్మించిన కబేళా (జంతువధశాల) నిరుపయోగంగా మారింది. లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన ఈ కబేళా పాలక వర్గాల నిర్లక్ష్యానికి బలై అనాథలకు ఆవాసంగా మారింది. మాంసం మార్కెట్ లోని వ్యాపారుల కోసం దీనిని 2002లో అప్పటి శాసనసభ్యుడిగా ఉన్న సామినేని ఉదయభాను శంకుస్థాపన చేయగా సుదీర్ఘ కాలం పాటు నిర్మాణం జరిగి 2010 లో ప్రారంభమైంది. కొంతకాలం దీనిలో వ్యాపారులు జంతువులను వధించే కార్యక్రమాలు చేపట్టినప్పటికీ అనంతరం వారికి సరైన వసతులు లేక కబేళాను ఉపయోగించడం మానివేశారు. ప్రస్తుతం పట్టణంలోని పోలీస్ క్వార్టర్స్ వద్ద ఉన్న మాంసం మార్కెట్ వద్దే వ్యాపారులు మేకలు, గొర్రెలను వధిస్తున్నారు. దీంతో పట్టణ నడిబొడ్డున ఉన్న మార్కెట్ ప్రాంతం అపరిశుభ్రంగా మారింది. పశువుల మాంసం నుంచి వచ్చే వ్యర్థ పదార్థాలను అక్కడే పడవేయటంతో ఆ కంపు భరించలేక పోతున్నామని ఆప్రాంత వాసులు వాపోతున్నారు.

వసతులు లేక..వ్యాపారుల నిరాసక్తత

కబేళా కట్టిస్తే ఓ పనై పోతుందన్నట్లుగా మున్సిపల్ అధికారులు దీనిని నిర్మించి చేతులు దులుపుకొన్నారు. కాని ఈ జంతువధశాలకు కావలసిన వసతులు కల్పించటంలో పూర్తిగా విఫలమయ్యారు. ముఖ్యంగా నీటి సౌకర్యం కల్పించలేదు. దీనిలో జంతువులను వధించిన అనంతరం వ్యాపారులు మాంసంలోని వ్యర్థ పదార్థాలను శుభ్రపరుస్తారు. అందుకోసం సమృద్ధిగా నీరు కావాల్సి ఉంటుంది. కాని ఆసౌకర్యం కల్పించక పోవటంతో ఇక్కడ జంతువులను వధించేందుకు వ్యాపారులు నిరాసక్తత చూపిస్తున్నారు. తెల్లవారు జామున 4 గంటల నుంచి జంతువులను వధించే పనులు మొదలవుతాయి కాబట్టి విద్యుత్ లైట్ల సౌకర్యం తప్పనిసరిగా ఉండాలి. కాని ఇప్పటివరకు ఆ సౌకర్యం లేక పోవటంతో చీకట్లో తమ పనులు నిర్వహించలేమని వ్యాపారులు అంటున్నారు.

అసాంఘిక కార్యక్రమాలకు ఆవాసం

మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యానికి గురైన ఈ కబేళా ప్రస్తుతం అసాంఘిక శక్తులకు ఆవాసంగా మారింది. కబేళాలో ఎటువంటి వ్యాపార కార్యకలాపాలు జరగక ఖాళీగా ఉండటంతో దీనిలో పగలు కొందరు వ్యక్తులు పేకాట ఆడుతున్నారు. అల్లరి మూకలు రాత్రుళ్లు మద్యం తాగి గొడవలు చేస్తున్నారని ఆ ప్రాంత వాసులు ఆరోపిస్తున్నారు. ఇతరత్రా అసాంఘిక కార్యక్రమాలు ఇక్కడ యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు కబేళాపై శ్రద్ధ చూపించి నీరు, విద్యుత్ తదితర మౌలిక సదుపాయాలు ఏర్పాటుచేసి కబేళాను వినియోగంలోకి తీసుకురావాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

అధికారులు చర్యలు తీసుకోవాలి



పట్టణంలోని బలుసుపాడు రోడ్డులో ఉన్న కబేళాను ఎవరూ పట్టించుకోవడం లేదు. దీంతో దానిలో పగలు పేకాట, గుట్కాలు, మద్యపానం రాత్రి వేళల్లో అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారింది. వ్యాపారులకు సౌకర్యాలు ఏర్పాటుచేసి ఈ కబేళాను వెంటనే వినియోగంలోకి తీసుకురావాలి.

– కనిగిరి సుబ్బారావు, 23 వ వార్డు, జగ్గయ్యపేట

తగిన చర్యలు తీసుకుంటాం



నిరుపయోగంగా మారిన కబేళా వద్ద వసతులు, మౌలిక సదుపాయాల లేమిని పరిశీలించి చర్యలు తీసుకుంటాం. పేకాట తదితర అసాంఘిక కార్యక్రమాలపై నిఘా ఏర్పాటుచేసి వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. విద్యుత్, నీటి సౌకర్యం కల్పించడంపై స్థానిక కౌన్సిలర్లతో సమీక్షించి చర్యలు తీసుకుంటాం.

–సీహెచ్ నాగమల్లేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్, జగ్గయ్యపేట

కలుపుతీత...అదనపు వాత

- వర్షాలకు పత్తిలో పెరిగిన కలుపు
- పెరగనున్న కూలీల గిరాకీ



వత్సవాయిలో పత్తిలో కలుపు తొలగిస్తున్న కూలీలు

వత్సవాయి: ఇటీవల పది రోజులకు పైగా కురిసిన వర్షాలకు పత్తి పంటలో విపరీతంగా కలుపు పెరిగింది. అసలే పెట్టుబడులకు అరకొరగా చేతిలో ఉంచుకున్న నగదులో సగానికి పైగా కలుపు తీయడానికే ఖర్చు పెట్టాల్సివస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పత్తి తోటల్లో పెరిగిన కలుపు రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. రోజు విడిచి రోజు వర్షం పడుతుండడంతో పొలాల్లో కలుపుతీసే వీలు లేకుండా పోయింది. వర్షాలకు పత్తి మొక్కలు ఎర్రబారకుండా రైతులు యూరియాను చల్లారు. దీంతో భూమిలో బలం పెరిగి గతంలో ఎన్నడూ లేనంతగా కలుపు పెరిగింది. ఎకరం పొలంలో కలుపు మొక్కలను తొలగించడానికి 20 నుంచి 30 మందికి పైగా కూలీలు పడుతున్నారు. రైతులంతా ఒకేసారి కలుపు పనులు మొదలెట్టడంతో కూలీలకు గిరాకీ ఏర్పడింది.

పొరుగూరు నుంచి కూలీలు

గ్రామాలలో కూలీలకు గిరాకీ ఏర్పడడంతో కలుపు తీసేందుకు రైతులు పక్క గ్రామాల నుంచి కూలీలను తెచ్చుకుంటున్నారు. ప్రత్యేకంగా ట్రాక్టర్, ఆటోలను ఏర్పాటుచేసుకుని దూర ప్రాంతాల నుంచి ఉదయం తీసుకువచ్చి సాయంత్రం మళ్లీ వారి గ్రామాలకు పంపిస్తున్నారు. ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు పని చేస్తే మనిషికి రూ.200 కూలీ, అదే ఉదయం పదిన్నర గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పనిచేస్తే రూ.300 కూలీ తీసుకుంటున్నారు. మరి కొంత మంది పొలాన్ని బట్టి కాంట్రాక్టు మాట్లాడుకుని కలుపు తీస్తున్నారు.

ఎన్నడూ లేనంతగా పెరిగిన కలుపు

ఎకరం పొలంలో కలుపు మొక్కలు తొలగించడానికి సరాసరి 20 నుంచి 30 మందికి పైగా కూలీలు పడుతున్నారు. కొన్నిచోట్ల అంతకంటే ఎక్కువమందే పడుతున్నారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో వచ్చినంత కలుపు గతంలో ఎప్పుడూ రాలేదని చెబుతున్నారు. పల్లపు భూముల్లో ఇంకా ఎక్కువ కలుపు సమస్య ఉంది. ముందుగా కలుపుమందు పిచికారీ చేసినా ఫలితం లేకుండా పోయింది. కలుపు కూలీ ఖర్చులు ఈ ఏడాది అదనం అయ్యాయని రైతులు వాపోతున్నారు.

దోమల రహిత సమాజం కోసం సహకరించాలి



గండేపల్లిలో ప్రపంచ దోమల దినోత్సవ కార్యక్రమంలో డాక్టర్ జెస్సీ లివింగ్ ఫెయిత్, రత్నాకర్, విద్యార్థులు



మాగల్లులో దోమల నియంత్రణపై అవగాహన ర్యాలీ చేస్తున్న విద్యార్థులు, వైద్యారోగ్య సిబ్బంది

కంచికచర్ల: దోమల రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ సహకరించాలని, నివారణకు తగు చర్యలు తీసుకోవాలని పెండ్యాల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యురాలు జెస్సీ లివింగ్ ఫెయిత్ విజ్ఞప్తిచేశారు. మండలంలోని గండేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా సోమవారం విద్యార్థులతో కలసి ఆమె ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దోమలను నియంత్రించకపోతే దోమకాటుకు గురై మలేరియా, డెంగీ జ్వరాల బారిన పడతారని హెచ్చరించారు. ఇళ్ల ముందు వర్షపు నీరు, ఇళ్లలో వాడుకునే నీటిని నిల్వ ఉండకుండా పారుదల అయ్యేలా చూడాలన్నారు. డ్రైనేజీల్లో పేరుకుపోయిన చెత్తా చెదారాన్ని తొలగించి మురుగునీటి పారుదలకు చర్యలు తీసుకోవాలన్నారు. లేకపోతే అవి దోమలకు ఆవాస కేంద్రాలుగా మారి లారా వ్యాప్తి చెంది దోమలు విజృంభిస్తాయన్నారు. ప్రజలంతా కాచి చల్లార్చిన నీటినే తాగాలన్నారు. రాత్రి వేళల్లో దోమ తెరలను వాడాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి జిల్లేపల్లి రత్నాకర్, ఆరోగ్య సిబ్బంది, ఆశ వర్కర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాగల్లులో...

నందిగామటౌన్: దోమ రహిత సమాజం ఆరోగ్యానికి సోపానమని కమ్యూనిటీ హెల్త్ అధికారి వర్షిణి అన్నారు. ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా మండలంలోని మాగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి మంగళవారం దోమల నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఖాళీ ప్రదేశాలు, నీటి నిల్వ ప్రాంతాలలో దోమల వ్యాప్తి అధికంగా ఉంటుందని, ఇంటి పరిసరాలలో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. ముఖ్యంగా దోమ తెరలను వాడటం, కాచి చల్లార్చిన నీటిని తాగటం వల్ల రోగాల బారిన పడకుండా కాపాడుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, వైద్యారోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలి

న్యాయమూర్తి శోభారాణి



మాట్లాడుతున్న న్యాయమూర్తి శోభారాణి, చిత్రంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సుందరరావు, ఏజీపీ

జగ్గయ్యపేటఅర్బన్: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని విద్యలో రాణించాలని మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్‌పర్సన్, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ఎం.శోభారాణి సూచించారు. గౌరవ ఏపీ లీగల్ సర్వీసెస్ అథారిటీ, అమరావతి వారి ఉత్తర్వుల మేరకు మంగళవారం స్థానిక లిటిల్ ఏంజిల్స్ స్కూల్‌లో మండల లీగల్ సర్వీసెస్ కమిటీ, జగ్గయ్యపేట ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి విద్యార్థులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి అవగాహన కల్పించారు. పిల్లల అక్రమ రవాణా ఏ విధంగా జరుగుతుంది, ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి, లీగల్ సర్వీసెస్‌ను ఏ విధంగా సంప్రదించాలనే అంశాలపై వివరణ ఇచ్చారు. పిల్లల పట్ల స్కూల్ యాజమాన్యం తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలియజేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అన్నెపాగ సుందరరావు, ట్రెజరర్ సీహెచ్ ఆంజనేయులు, ఏజీపీ టీఎల్ నరసింహారావు, ప్యానల్ న్యాయవాదులు ఎం.విజయకుమారి, డి.నాగేశ్వరరావు, న్యాయవాదులు రెడ్డి, మన్నె మురళి, మాతంగి నరేష్, రత్నబాబు, పారా లీగల్ వలంటీర్లు, స్కూల్ ప్రిన్సిపాల్, కరస్పాండెంట్, స్కూల్ యాజమాన్య ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రచార రథం షెడ్డుకే పరిమితమా?

గత ఏడాది శ్రావణమాసంలో గ్రామాల్లో తిరిగిన ప్రచార రథం



అమ్మవారి సత్రాల్లోని షెడ్‌లో ఉన్న ప్రచార రథం

పెనుగంచిప్రోలు: పెనుగంచిప్రోలు శ్రీతిరుపతమ్మవారి ప్రచార రథం ఆలయ సత్రాల్లోని షెడ్డుకే పరిమితమైంది. భక్తులు ఇచ్చిన విరాళాలతో ప్రచార రథాన్ని ఏర్పాటు చేశారు. మొదట్లో గ్రామాల్లో అమ్మవారి శాంతి కల్యాణాలు నిర్వహించే సమయంలో, పలు ఉత్సవాల సమయంలో అధికారులు అమ్మవారి ప్రచార రథాన్ని తిప్పారు. ఇటీవల శాంతి కల్యాణాలు కూడా తగ్గాయని భక్తులు అంటున్నారు. దీంతో భక్తులు లక్షలు వెచ్చించి ఇచ్చిన ప్రచార రథం షెడ్డుకు పరిమితం అవుతోందని అంటున్నారు. అయితే గత ఏడాది శ్రావణమాసం సందర్భంగా జగ్గయ్యపేట నియోజకవర్గ పరిధిలో గ్రామాల్లో కొలువై ఉన్న గ్రామ దేవతలకు ఆలయం తరపున శ్రావణ పట్టీ సమర్పించేందుకు ప్రచార రథంలో మేళతాళాలతో ఊరేగింపుగా వెళ్లటంతో ఎంతో ప్రచారంతో పాటు ఆధ్మాత్మిక భావం వెల్లివిరిసింది. అమ్మవార్లకు భక్తులు చీర, జాకెట్, పూలు, పసుపు, కుంకుమతో పాటు పండ్లు అందజేసేవారు. అయితే ఇదే సమయంలో అక్కడక్కడ కొంత ఇబ్బందులు తలెత్తాయి. దీంతో ఈ ఏడాది ఆ కార్యక్రమాన్ని పూర్తిగా నిలిపివేశారు. కార్యక్రమం నిలిపివేయటంపై భక్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. దీనిపై అధికారులను వివరణ కోరగా అమ్మవారి శాంతి కల్యాణం కావాలని భక్తులు అడిగితే ఆ గ్రామాలకు ప్రచార రథం పంపుతామన్నారు. గత ఏడాది శ్రావణ పట్టీ కార్యక్రమంలో భాగంగా కొన్ని ఇబ్బందుల వలన ఈ ఏడాది నిలిపి వేశామన్నారు. నాలుగో శ్రావణ శుక్రవారం ఆలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతం నిర్వహిస్తామని చెప్పారు.

ఎయిడ్స్ నియంత్రణకు సహకరించాలి



నందిగామ టౌన్: ఎయిడ్స్ వ్యాధి నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఏపీసీ వైద్యులు రాజేంద్రప్రసాద్, చక్రవర్తి అన్నారు. జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, నివారణ సంస్థల ఆధ్వర్యంలో చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్స్ స్కీమ్ పర్యవేక్షణలో మండలంలోని మాగల్లు గ్రామంలోని సచివాలయం వద్ద మంగళవారం ఎయిడ్స్ వ్యాధి నివారణలో భాగంగా మీకు తెలుసా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధి పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం ఎయిడ్స్ ఎలా సోకుతుంది, మందులు ఎక్కడ దొరుకుతాయి తదితర అంశాలపై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో లింక్ వర్కర్స్ స్కీమ్ ప్రోగ్రాం మేనేజర్, శ్రీరామ్ శ్రీనివాస్, జిల్లా రిసోర్స్ పర్సన్ లక్ష్మీ నాయక్, సుందర్‌రావు, వెంకట్రావమ్మ, సీహెచ్‌వో వర్షిణి, ఆశ వర్కర్‌లు పాల్గొన్నారు.

ప్రహరీ తొలగింపునకు ఆదేశాలు జారీ

జగ్గయ్యపేటఅర్బన్: పట్టణంలోని శాంతినగర్‌లో మున్సిపాలిటీ వారి సిమెంట్ రోడ్‌పై కట్టిన ప్రహరీగోడ అంటూ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న రోడ్డు పంచాయితీపై మున్సిపల్ కమిషనర్ సీహెచ్ నాగమల్లేశ్వరరావు స్పందించారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన ఈ స్థల వివాదానికి సంబంధించి స్పష్టమైన వివరణ ఇచ్చారు. స్థానిక శాంతినగర్‌లో డోర్ నెంబర్ 6-1013/డి లో గల స్థలంలో బి.పుల్లారావు అనే వ్యక్తి పురపాలక సంఘం వారి అనుమతులు లేకుండా వివాద స్థలంలో ప్రహరీ నిర్మిస్తున్నట్లు గుర్తించామని చెప్పారు. సదరు ప్రహరీ తొలగించవలసిందిగా నిర్మాణదారులకు నోటీసు జారీ చేసినట్లు తెలిపారు. తొలగించని పక్షంలో పురపాలక సంఘం వారే తొలగించి దానికి అయిన ఖర్చును కూడా వారి నుంచి రాబట్టేందుకు చర్యలు తీసుకుంటామని ఆదేశాలను నోటీసు ద్వారా జారీచేసినట్లు వివరించారు.

ప్రకృతి వ్యవసాయంలో మెలకువలు తెలుసుకోవాలి



గంద్రాయిలో పత్తి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు



తోటచర్లలో పత్తి మొక్కలు పరిశీలిస్తున్న డీడీఏ మాధవీలత, ఏడీఏ మనీషా తదితరులు

జగ్గయ్యపేట: రైతులు ప్రకృతి వ్యవసాయంలో మెలకువలు తెలుసుకోవాలని జిల్లా వనరుల కేంద్రం డెప్యూటీ డైరెక్టర్ మాధవీలత పేర్కొన్నారు. మండలంలోని గంద్రాయి, మల్కాపురం గ్రామాల్లో జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంలోని మెలకువలపై మంగళవారం రైతులకు అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు భూసార పరీక్షలను అనుసరించి ఎరువుల వాడకం, ప్రకృతి వ్యవసాయం చేసుకోవాలని తెలిపారు. ముఖ్యంగా ఎరువుల వాడకంలో పలు సూత్రాలు పాటించాలని చెప్పారు. కాంప్లెక్స్ ఎరువుల వాడకం తగ్గించి యూరియా, పొటాష్ ఎరువులను దశల వారీగా వాడటం వల్ల ఖర్చు తగ్గించుకోవచ్చని తెలిపారు. పొటాష్ ఎరువు వాడకం వల్ల పంటల్లో రోగనిరోధక శక్తి పెరిగి అధిక దిగుబడి వచ్చే అవకాశం ఉందని చెప్పారు. ముఖ్యంగా వరి పంటలో ప్రతి రెండు మీటర్లకు 20 కాలిబాటలు తీయటం వల్ల గాలి, వెలుతురు తగిలి దోమ ఉధృతి తగ్గించుకోవచ్చని తెలిపారు. వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలతో పత్తి పంటలో కూడా గులాబీ రంగు పురుగు ఉధృతి తగ్గించుకోవచ్చన్నారు. అనంతరం క్షేత్ర స్థాయిలో పత్తి, వరి పంటలను రైతులతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో ఏడీఏ భవాని, ఏవో వరలక్ష్మి, డీఆర్సీ ఏడీఏ మునీషా, ఆయా గ్రామాల వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.


ప్రకృతి వ్యవసాయంపై దృష్టి పెట్టాలి

తోటచర్ల, కొణకంచి(పెనుగంచిప్రోలు): ప్రకృతి వ్యవసాయంతో రైతుకు ఎన్నో లాభాలు కలుగుతాయని జిల్లా వనరుల కేంద్రం డీడీఏ మాధవీలత అన్నారు. మండలంలోని తోటచర్ల, కొణకంచి గ్రామాల్లో మంగళవారం పత్తి, వరి పొలాలను ఏఓ కె.రామసుబ్బారెడ్డితో కలిసి పరిశీలించారు. ముందుగా రైతులకు భూసార పరీక్షలను అనుసరించి సమగ్ర యాజమాన్య పద్ధతులు, ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సేంద్రీయ కర్బనం పెంచటం ద్వారా మొక్క పోషకాలను గ్రహిస్తుందన్నారు. దీంతో సూక్ష్మపోషక లోపాలను సవరించవచ్చన్నారు. పశువుల ఎరువు, వానపాముల ఎరువు, జీలుగలు, పెసర, పచ్చిరొట్ట విత్తనాలు సాగు చేయటం ద్వారా సేంద్రీయ కర్బనం పెంచుకోవచ్చన్నారు. పత్తిలో రసం పీల్చు పురుగుల నివారణకు మోనోక్రోటోఫాస్‌తో కాండపు పూత పూసి నివారించుకోవచ్చన్నారు. పురుగు మందులను వేపనూనెలో కలిపి వాడటం వల్ల పురుగుల గుడ్లు, పిల్ల పురుగులు నివారించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఏడీఏ మనీషా, గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

దేశభక్తుల జీవిత చరిత్ర పుస్తకాల పంపిణీ

నందిగామ టౌన్: సినీనటుడు చిరంజీవి జన్మదిన వారోత్సవాలలో భాగంగా మంగళవారం పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు మహనీయుల జీవిత చరిత్ర పుస్తకాలను అందజేశారు. అఖిల భారత చిరంజీవి యువత నియోజకవర్గ అధ్యక్షుడు పోలిశెట్టి వరుణ్, చిరంజీవి యువత సభ్యులు పాల్గొన్నారు.

అండర్ పాస్ ఇలా.. వెళ్లేదెలా?



అండర్‌పాస్‌లో నిలిచిన వర్షపు నీరు

చిల్లకల్లు(జగ్గయ్యపేట): గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలోని అండర్ పాస్ కొద్దిపాటి వర్షానికే ధ్వంసమై నీరు నిలిచి చిన్నపాటి చెరువును తలపిస్తోంది. గ్రామంలోని వేదాద్రి రోడ్డు, ధర్మవరప్పాడుతండా తదితర ప్రాంతాల నుంచి పాఠశాలకు వచ్చే విద్యార్థులు ఈ అండర్ పాస్ నుంచే రావాలి. ఇది కాక ఆయా ప్రాంతాల నుంచి చిల్లకల్లుకు వచ్చే వారు కూడా రోడ్డు దాటేందుకు ఈ అండర్‌పాస్‌నే వినియోగిస్తుంటారు. అండర్ పాస్ రోడ్డు ధ్వంసమవటంతో ఇటీవల కురిసిన వర్షాలకు రెండు, మూడు అడుగుల మేర నీరు నిలిచి విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారు. రోజుల తరబడి నిలిచిన నీటిలో నుంచి వెళ్తుండటంతో కొంతమంది విద్యార్థులు చర్మవ్యాధుల బారిన పడుతున్నారని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పరిస్థితి దారుణంగా ఉన్నా జాతీయ రహదారుల అభివృద్ధి అధికారులు కనీసం స్పందించటం లేదని తల్లిదండ్రులు, ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయండి



విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఇబ్రహీంపట్నం: విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలని ఏపీ పవర్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు కోరారు. ఈ మేరకు విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు సచివాలయ చాంబర్‌లో మంగళవారం వినతిపత్రం అందజేశారు. యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్నపూస సుబ్బిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఏపీ జెన్‌కో, ట్రాన్స్‌కో, డిస్కమ్‌లో పనిచేస్తున్న 25 వేల మంది కార్మికులు క్రమబద్ధీకరణ కోసం ఎదురు చూస్తున్నారని చెప్పారు. తెలంగాణ తరహాలో యాజమాన్యాలే కార్మికులకు నేరుగా వేతనాలు చెల్లించాలని కోరారు. 16 నెలల పెండింగ్ వేతన బకాయిలు తక్షణం చెల్లించాలని, 20 ఏళ్లుగా ప్రమోషన్‌కు నోచుకోని ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలని కోరారు. యూనియన్ నాయకులు మోహనరావు, రాజు, గురవయ్య, వలీ, ముసలయ్య పాల్గొన్నారు.

నగరంలో 'ఆయ్' సందడి



'ఆయ్' హీరో హీరోయిన్‌లు నితిన్, నయన్‌సారిక

లబ్బీపేట(విజయవాడతూర్పు): నగరంలో ఆయ్ చిత్ర బృందం మంగళవారం సందడి చేసింది. పిన్నమనేని పాలీక్లినిక్ రోడ్డులోని ఎస్ఎస్ ఇడ్లీ హోటల్లో టిఫిన్ చేసి, అక్కడకు వచ్చిన వారితో ముచ్చటించారు. ఈ సందర్భంగా నిర్వహించిన మీడియా సమావేశంలో ఆ చిత్ర హీరో నార్నే నితిన్ మాట్లాడుతూ ఆయ్ చిత్రం విడుదలైన అన్ని చోట్ల పాజిటివ్ టాక్‌తో బాక్సాఫీస్ వద్ద సెన్సేషన్ సృష్టిస్తోందన్నారు. ఈ నేపథ్యంలో ఆంధ్ర, తెలంగాణ ప్రాంతాల్లో సక్సెస్ టూర్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అన్ని ప్రాంతాల్లో థియేటర్స్‌లో ప్రేక్షకులను కలిసి కృతజ్ఞతలు చెపుతున్నామని, ప్రతిచోట బ్రహ్మరథం పడుతున్నట్లు చెప్పారు. అనంతరం హీరోయిన్ నయన్ సారిక మాట్లాడుతూ ఆయ్ విజయవంతం కావడం సంతోషంగా ఉందన్నారు. ఈ చిత్రాన్ని వీక్షించి సక్సెస్ చేసిన ప్రేక్షకులకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.